ENADU

22 JUN 2021

## నిస్వార్థ ప్రజాసేవకుడు పండు కృష్ణమూర్తి

**యానాం:** అంబేడ్కర్ భావజాలాన్ని జీవితాంతం పాటించిన నిస్వార్థ ప్రజాసేవకుడు పండు కృష్ణమూర్తి అని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, పలువురు వక్తలు కొనియాడారు. తెదేపా పాలనలో 1985 నుంచి 89వరకు ముమ్మిడివరం ఎమ్మెల్యేగా పనిచేసిన పండు కృష్ణమూర్తి ఈ నెల 8న యానాంలో మృతిచెందారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ మున్సిపల్ కల్యాణ మండపంలో సోమవారం ఆయన కుటుంబ సభ్యులు సంస్మరణసభను నిర్వహించారు. పదవిలో ఉన్న రోజుల్లోనూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించిన ఆదర్శవాదని, ఎన్టీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా, తితిదే బోర్డు డైరెక్టరుగా, అనేక కమిటీల్లో కీలకపాత్ర పోషించారని వక్తలు గుర్తుచేసుకున్నారు. 1942లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మన జిల్లాకు వచ్చినప్పుడు స్టూడెంట్ వాలంటీరుగా ఆయన్ను చూసిన అదృష్టవంతుడు కృష్ణమూర్తి అని అన్నారు.

## 402 మద్యం సీసాలు స్వాధీనం

**యానాం:** యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను అక్కడి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన చింతా ప్రసాద్ యానాం యూకేవీ నగర్‌లోని 10వ వీధిలో నివసిస్తున్నారు. కోనసీమకు ఆటోలో అక్రమంగా మద్యం సీసాలను తీసుకెళుతున్న అతడిని బైపాస్‌రోడ్డులో పట్టుకుని 402 మద్యం సీసాలు, ఆటోను యానాం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.రాము నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుల్ సబ్బతి అప్పారావు తదితరులు నిందితుడిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. మద్యం ధరల్లో యానాం, ఆంధ్రాకు మధ్య రెట్టింపు వ్యత్యాసం ఉండడంతో పలువురు యానాంలో కొనుగోలుచేసి సరిహద్దు ఏపీ గ్రామాలకు తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

## వ్యాక్సినేషన్‌లో చేతివాటం

**యానాం:** స్థానికంగా ఉన్న టీకా కేంద్రంలో పనిచేస్తున్న కొందరు, యానాం సరిహద్దు ప్రాంతాలకు చెందిన ఇతరుల నుంచి నగదు తీసుకొని టీకాలు వేయిస్తున్నారని అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై పర్యవేక్షణ అధికారి డాక్టర్ టి.రవిశంకర్ ఆరాతీశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. కాగా సోమవారం 584 మందికి కొవిడ్ టీకాలు వేసినట్లు పర్యవేక్షణ అధికారి తెలిపారు.

## యానాంలో 30 వరకు ఆంక్షలు

**యానాం:** యానాంలో ఈ నెల 30 అర్ధరాత్రి వరకు ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పరిపాలనాధికారి అమన్ శర్మ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందన్నారు.

భాజపా, ఆర్ఎస్ఎస్ యానాం విభాగం ఆధ్వర్యంలో గురువు పేర్ని ఆదినారాయణమూర్తి

యోగాసనాలు సాధన చేయించారు. ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి, యోగా, నేచురోపతి డిస్పెన్సరీలో లైవ్ వెబినార్ ద్వారా వివరించారు.

## యాత్ర @ లద్దాఖ్



బయలుదేరుతున్న శ్రీకాంత్

**యానాం:** ఏదో ఒక సాహసం చేసి గుర్తింపు పొందాలన్న తలంపు ఒకవైపు, నిరవధికంగా పెంచుతున్న పెట్రోలు ధరలపై నిరసన తెలపాలన్న ఆలోచన మరోవైపు.. ఈ నేపథ్యంలో యానాంకు చెందిన కడలి శ్రీకాంత్(21), జమ్మూకశ్మీర్ పరిధిలోని లద్దాఖ్‌కు సైకిల్ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ యువకుడు రాజమహేంద్రవరంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సోమవారం ఉదయం 6.45 గంటలకు యానాంలోని తన ఇంటి నుంచి లద్దాఖ్‌కు బయలుదేరాడు.

## ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి

**యానాం:** యానాం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా 14 వార్డుల ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలుంటే ఈ నెల 27, సాయంత్రం 5 గంటల్లోగా తెలపాలని మున్సిపల్ కమిషనర్ గుజ్జు గౌరీసరోజ తెలిపారు.

ANDHRA JYOTHI

22 JUN 2021

## యానాం సమస్యలు పరిష్కరించండి: మల్లాడి

యానాం, జూన్ 21: యానాం నియోజకర్గంలో వివిధ శాఖలకు చెందిన పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వివిధశాఖల అధికారులను మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు కోరారు. సోమవారం పుదుచ్చేరిలోని విద్యాశాఖ డైరెక్టర్ రుద్రగౌడ్‌ను కలిశారు.విద్యాశాఖ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు విడుదల చేయాలని, ఇటీవల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికలు నిర్వహించిన వారికి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అనంతరం స్వపరిపాలన శాఖ డైరెక్టర్‌ను కలిశారు. యానాం మున్సిపాల్టీకి సంబంధించి క్లీనింగ్, సిబ్బంది, విశ్రాంతి ఉద్యోగులు జీతాలు విడుదలయ్యాయి. అయితే జీవో పాటు నిధులు విడుదలకు బీమ్స్ ఓపెన్ చేయాలని కోరారు.

**యానాం:** స్థానిక ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కనకాలపేట ప్రభుత్వ పాఠశాల అవరణలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా యానాం యోగా గురు పేర్ని ఆదినారాయణమూర్తి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధుల ఆధ్వర్యంలో సామూహిక యోగాసనాలు వేశారు. రామారావు, రామ్‌దాస్, వాసు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత సాహిత్యంలో సూర్యుడు 'నేతల'

- సంస్మరణ సభలో ప్రముఖుల నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న శిఖామణి

యానాం, జూన్ 21: అన్నంగిన్నె, భీమ్‌పాల్‌రాగం, సమతా వసంత గానం వంటి రచనల ద్వారా దళిత సాహిత్యంలో అంబేడ్కరిజాన్ని ప్రతిష్ఠించిన నేతల ప్రతాప్ అని వక్తలు కొనియాడారు. దళిత రచయిత వేదిక, కవిసంధ్య ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన నేతల ప్రతాప్‌కుమార్ సంస్మరణ సభ జూమ్ వేదికగా జరిగింది. కవిసంధ్య సంపాదకుడు డాక్టర్ శిఖామణి అధ్యక్షత వహించి మాట్లాడారు. దళిత కవిత్వంలో అంబేడ్కర్ వాద కవిత్వానికి నేతల ఆద్యుడని పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను దళితుల అన్నంగిన్నెకు ప్రతీకగా చెప్పాడన్నారు. ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ దళిత మహాసభ ద్వారా నేతల కార్యకర్తగా, కవిగా ఎదిగాడని, దళిత సాహిత్య ఆకాశంలో నేతల సూర్యుడు వంటి వాడని అన్నారు. దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ యానాంతో నేతలకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. అనంతరం డా.కొయి కోటేశ్వరరావు, ఎన్.జె.విద్యాసాగర్, డా.చల్లపల్లి స్వరూపారాణి, పల్నాటి శ్రీరాములు, కొప్పర్తి, కోనాల

SAKSHI

# యానాం నుంచి మద్యం అక్రమ రవాణా

22 JUN 2021

యానాం: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి మద్యం ఆటోలో అక్రమరవాణా అవుతున్న సమాచారం మేరకు సోమవారం యానాం పోలీసులు వాహనాన్ని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఆటోలో అక్రమ రవాణా అవుతున్న రూ.40వేల విలువ చేసే మద్యాన్ని సోమవారం బైపాస్ సెంటర్‌లో యానాం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 47 రాయల్ స్టాగ్ బాటిల్స్, 295 రాయల్ గ్రీన్‌క్వార్టర్ బాటిల్స్, 60 బడ్వయిజర్ బీర్‌లను పట్టుకుని ఆటోను సీజ్ చేసినట్టు ఎస్సై రాము తెలిపారు.

**బాణసంచా సీజ్ చేసిన షాపులో తనిఖీలు**

నిబంధనలకు విరుద్ధంగా యానాం పట్టణం నడిబొడ్డున ఉన్న జ్యోతిశ్రీ రెడీమేడ్ వస్త్రాల షాపులో నిల్వ ఉంచిన దీపావళి మందుగుండ సామగ్రిని గతేడాది నవంబర్ 2న అధికారులు సీజ్ చేశారు. స్థానికుడు ఆదిమూలం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం విశాఖపట్టణం నుంచి ఐపీఈఎస్ఎస్ డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ అధికారి బి. రవికుమార్ తదితరుల బృందం, స్థానిక రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన షాపును తెరిపించి అంతస్తు పైభాగంలో, కింది భాగంలో నిల్వ ఉంచిన రూ.లక్షలు విలువ చేసే మందుగుండు సామగ్రిని పరిశీలించి వాటిని పూర్తి తనిఖీ చేసి వాటి బరువును సైతం లెక్కగట్టి బాక్సుల్లో పార్శిల్ చేశారు. ఈ సందర్భంగా తనిఖీలో ఆర్ఏఓ అమన్‌శర్మ, సీఐలు అర్విసెల్వం, గూటం శివగణేష్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణన్, ముందుస్తు జాగ్రత్తగా అగ్నిమాపక దళ సిబ్బందిని మోహరించారు. అయితే మందుగుండు సామాగ్రి తరలింపుపై మంగళవారం నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లు

## యానాం సబ్‌జడ్జిగా సెంథిల్ మురళి

యానాం: యానాం సబ్‌కోర్టు జడ్జిగా తిరునల్వేళి మూడో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా ఉన్న ఎన్ సెంథిల్ మురళిని నియమిస్తూ సోమవారం మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ పి.ధనబాల్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో పదోన్నతి ఇచ్చి సబ్ జడ్జిగా నియమించారు.

PRAJA SAKTHI

22 JUN 2021

## దళిత సాహితీ సూర్యుడు నేతల

ప్రజాశక్తి-యానాం

దళిత సాహిత్యంలో నేతల ప్రతాప్ కుమార్ సూర్యుడు వంటివాడని ప్రముఖ కవి, దళిత ఉద్యమకారుడు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. సోమవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయనకు పలువురు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ దళిత మహాసభ ద్వారా నేతల కార్యకర్తగా, కవిగా ఎదిగాడని చెప్పారు. తన జీవితానికి సాహిత్యానికి అంబేద్కర్‌లో ప్రాపంచిక దక్పథాన్ని అన్వయించుకున్నాడని చెప్పారు. కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణి మాట్లాడుతూ అన్నంగిన్నె, భీమ్‌పాల్ రాగం, సమతా వసంత గానం వంటి రచనల ద్వారా దళిత సాహిత్యంలో అంబేద్కరిజాన్ని ప్రతిష్టించిన నేతల ప్రతాప్ అని కొనియాడారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఎన్‌జె.విద్యాసాగర్, డాక్టర్ చల్లపల్లి స్వరూపారాణి, పల్నాటి శ్రీరాములు, కోనాల భీమారావు, సిహెచ్.రామ్, రవి, జె.గౌతమ్, ఇనకోటి రాంబాబు, నవీన్, నందా, సోమశేఖర్, గురుప్రసాద్, ఆదినారాయణ, పెద్దిరాజు, పావన్ ప్రసాద్ మాట్లాడారు.

## మద్యం పట్టివేత

యానాం : యానాం నుంచి ఆంధ్రాప్రాంతానికి ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.40 వేలు విలువైన మద్యాన్ని సోమవారం బైపాస్ సెంటర్‌లో యానాం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 47 రాయల్ స్టాగ్ బాటిల్స్, 295 రాయల్ గ్రీన్ క్వార్టర్ బాటిల్స్, 60 బడ్వయిజర్ బీర్లను పట్టుకుని ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

## ఓటర్ల జాబితా ముసాయిదా ప్రదర్శన

ప్రజాశక్తి-యానాం

పుదుచ్చేరి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా యానాం మున్సిపాల్టీకి సంబంధించి 14 వార్డుల ఓటర్ల జాబితా ముసాయిదాను పరిశీలన నిమిత్తం ప్రదర్శించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.గౌరి సరోజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల పరిశీలన నిమిత్తం కనకాలపేట కళ్యాణ మండపం, మున్సిపల్ కార్యాలయం, కురసంపేట కమ్యూనిటీ హాల్, సావిత్రినగర్ కమ్యూనిటీ హాల్ ప్రదేశాలలో జాబితాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. అభ్యంతరాలను 27వ తేదీసాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలని కోరారు.